మందాకినిలో స్నానం చేసి, వొంటినిండా విభూది పూసికొని, విభూతి దాల్చిన ఫాలభాగాన గంగమట్టిపెట్టి, కమండలవులో గంగ నింపుకొని, అడవి పూలమాలను చేతిలో పట్టుకొని, పరమశివుడు కైలాసాచల సాను వీధికి వచ్చాడు. తన సౌధం దగ్గరకు వచ్చాడు. అసలది తన గృహమేనా! ఆశ్చర్యపోయాడు. రోజూ తన రాకకు ఓరచూపులు చూస్తూ రంకెలు వేసే నందీశ్వరుడు గడ్డి నెమరేస్తూ కాలు మీద కాలుంచుకొని పడుకున్నాడు. శృంగి, భృంగిల పత్తాయే లేదు. చిలుకలు, గోరువంకలు ఏమైనాయో కన్పించలేదు. లతలన్నీ పూలతో నిండి వున్నాయి!




ఒక్క పూవు కూడా ఈశ్వరారాధనకు సేకరింపబడలేదు. అగ్నిహోత్రం వెలిగిన జాడలేదు. ఇంటిలో మనుష్యులున్న సవ్వడి లేదు. గాజుల గలగలలు లేవు. వీణా గానాలు లేవు. గజ్జెల ఘలంఘలులు లేవు. ఆయనకంతా అయోమయంగా వుంది. రోజూ చిరునవ్వుతో వొయ్యారా లొలకబోస్తూ జగన్మోహినిలా తనకెదురు వచ్చే పార్వతేమైంది! హుటాహుటియింట్లోకి నడిచాడు. నిశ్శబ్దం. గదులన్నీ వెదికాడు. శూన్యం!

మరి గిరిజ యేమైంది? పుట్టింటికెళ్లిందా? చెప్పకుండా వెళ్లదే! అయినా కన్నవారింటికెళ్లిన సతి అనుభవ మామెకు కన్నవారింటికెళ్లే మమకారాన్ని మాయం చేసింది. మరైతే ఆమె యేమైంది! తోటంతా కలయ దిరిగాడు. పట్టపగలు చీకట్లు చిందే కోనలో కాంతివెల్లువలా పర్వతాగ్రాలపై నుండి ఉరుకులు పెట్టే జలపాతం దగ్గర చెక్కిట చేయి చేర్చుకుని, మోకాలు మడిచి, మొగమెర్ర చేసుకొని జలపాతాన్ని తిలకిస్తోంది కాత్యాయిని. శివుడాశ్చర్యపోయాడు. ఈ సమయంలో ఈమె యిక్కడుందేమబ్బా! అనుకున్నాడు. దగ్గరకు వెళ్లాడు. ఆయన ధరించిన సర్పభూషణాలు బుస్సుమన్నాయి. ప్రేమగా ఆమె పైకి పడగలు సాచాయి. ఆమె కదలలేదు. శివుడామె భుజం మీద చేయి వైచి "అపర్ణా! అలుక పూనావా! నా వల్ల పొరపాటేమైనా జరిగిందా?" అన్నాడు.

ఆమె విదిలించింది. తాను మరో వైపుకు తల తిప్పుకుంది. శివుడీ మారామె చుబుకం పుణికి కళ్లల్లోకి చూస్తూ "గిరిజా! ఎందుకింత కోపం? నేను కిరాతుణ్ణి, వనచరుణ్ణి. నాగరికత తెలియని వాణ్ణి. నా వల్ల అపరాధం జరిగితే మన్నించు. అదేమో చెబితే సరిదిద్దుకుంటా. అంతేకాని, నీవిలా అలుక సాగిస్తే నేనేం కావాలి?" ఆమెను బతిమాలాడు. బామాలాడు. గిలిగింతలు పెట్టాడు. ఆమె చలించలేదు సరిగద మురచురా చూచింది. శివుడూరుకోలేదు. ఆమెను బలవంతంగా కౌగిట్లోకి తీసుకున్నాడు. కోపకారణం చెప్పందే ఆమెను వదలనన్నాడు. గిరికుమారి జొటజొటా కన్నీరు కార్చింది. శివుడదిరిపోయాడు. ఏదో పెద్ద గ్రంథమే వుందనుకున్నాడు.

అన్నాడు —"ప్రాణాధిక ప్రియా! ఎందుకింత వగపు! కావాలిస్తే నన్ను శిక్షించు. అంతేగాని యిట్లా మాట్లాడకుండా బాధపెట్టకు" కన్నుల కాశ్మీరాలు రాలుతూండగా, అగజ అన్నది —"చేసేదంతా చేసి చివరికీ పరిదేవనలెందుకు?" అని.

"నేనా? ఏం చేశాను? అదేదో నీవే చెప్పు అపర్ణా!"

"అవును. అపర్ణనై మిమ్ము కావాలని కట్టుకున్నందుకు చక్కని శాస్తి చేశారు."

శివుడికేమీ పాలు పోలేదు. "ప్రియా! నీవు అర్ధాంగివి."

"ఔను. అర్ధాంగిని. అలా చెప్పి మోసం చేశారు. మాయ పుచ్చారు."

"నేనా!"

"అవును. ఈ సర్వ సృష్టిలోని స్త్రీ జాతికి నేను మూల భూతురాలను గద!"

"అవును!"

"నిలకడలేని గంగను నెత్తికెక్కించుకున్నారు. కళ తక్కువ చంద్రుని శిరస్సున దాల్చారు. నన్ను, నన్ను మాత్రం ..."

"నిన్ను మాత్రం?"

"భక్తులందరూ శివవామ భాగనిలయా! అంటూంటే నాకెంత చిన్నతనంగా వుందో మీకేం తెలుస్తుంది? "

"నీవు నా వామభాగిని యనేగా మరి!"

"అక్కడే వుంది అన్యాయం. మా స్త్రీ జాతినంతను వామ భాగాన నిలిపి మీ పురుషుల వమానించారు. అది దుర్భరం."

శివుడు నవ్వుతూ — "ఓ అదా! అపర్ణా! నీవెంతటి పిచ్చిదానివి! గంగ నిలకడ లేనిది కాబట్టి జటలలో బంధించాను. స్వేచ్ఛనరికట్టాను. కళాకళలవాడు కాబట్టి చంద్రుణ్ణి అక్కడే నిలిపాను. మరి నీవు సాక్షాత్తు జగజ్జననివి. నా ప్రాణ శక్తివి. ఆదిశక్తివి! నిన్ను వామ భాగంలో ఎందుకుంచుకున్నానో తెలియదా? నీవు నా గుండెలో గూడు కట్టిన ప్రేమమూర్తివి. వామ భాగానే వుంది హృదయం.

అందుకే నిన్ను నా హృదయాధినేత్రిగా హృదయంలో పదిలపరచినాను పరాశక్తీ!"

హైమవతి సిగ్గుపడ్డది. శివుడామెను దగ్గరకు తీసుకొని "ఇప్పుడు స్పష్టమయిందా చెలీ!" అన్నాడు.

పార్వతి లోకేశ్వరుని కౌగిలింతలో పులకించిపోయింది!

— మల్లాది వసుంధర